

ఆలస్యంగా రైళ్ల రాకపోకలు

- దారి మళ్లింపులతో గంటల కొద్దీ ఆలస్యం
- మూడు చోట్ల క్రూ మార్పుతో ప్రత్యక్ష నరకం



గుంటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వర్షాలు ఆగాయి.. అయినా ఇంకా రైళ్ల రాకపోకలు కొలిక్కిరాలేదు. కొన్ని రైళ్లను దారి మళ్లించి నడుపుతున్నారు. దీంతో పలు రైళ్లు గంటలకొద్దీ ఆలస్యంగా నడుస్తుండటంతో ప్రయాణికులు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారు. కేవలం గూడ్స్ రైళ్లను మాత్రమే ఇప్పటి వరకు నడుపుతున్న ఈ రూట్‌లో గత వారం నుంచి విజయవాడ వైపునకు వెళ్లాల్సిన రైళ్లను దారి మళ్లించి తీసుకొస్తున్నారు. దీంతో సాంకేతికంగా అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రాయనపాడు వద్ద వరదనీరు పట్టాల పైకి చేరుకుంటున్నదని ఈ ప్రత్యామ్నాయాన్ని రైల్వే శాఖ చేస్తున్నది. అయితే ఇది ప్రయాణికులను తీవ్ర అసౌకర్యానికి గురి చేయడమే కాకుండా 12 గంటలకు పైగా ఆలస్యంగా గమ్యస్థానాలకు రైళ్లను నడపాల్సిన పరిస్థితి తలెత్తుతున్నది. దాంతో రేక్ షేరింగ్ ఉన్న రైళ్లను రీషెడ్యూల్ చేయాల్సి వస్తున్నది. గురువారం అర్ధరాత్రి దాటాక హఠాత్తుగా సికింద్రాబాద్ నుంచి కాజీపేట మీదగా విజయవాడ వైపునకు వెళ్లాల్సిన రైళ్లను జగ్గయ్యపేట వద్ద నుంచి మోటుమర్రి, విష్ణుపురం, గుంటూరు మీదగా దారి మళ్లిస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. అప్పటి వరకు రైలుని నడిపిన క్రూ(లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్, గార్డు) అక్కడ దిగిపోవాలి. అనంతరం మోటుమర్రి సెక్షన్‌లో గూడ్స్ రైళ్లను నడిపే క్రూతో విష్ణుపురం తీసుకురావాలి. ఆ తర్వాత విష్ణుపురం నుంచి విజయవాడ వరకు మరో క్రూని సమకూర్చాలి. విష్ణుపురం వద్ద గుంటూరు డివిజన్‌కు చెందిన క్రూ అందుబాటులో ఉండరు. నల్లపాడులో ఉన్న సిబ్బందిని అక్కడికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. అలానే విష్ణుపురంలో ఎలాంటి క్యాటరింగ్ సదుపాయాలు కూడా ఉండవు. దీంతో గంటల తరబడి గోదావరి, మహబూబ్‌నగర్ - వైజాగ్, నాగర్‌సోల్ - నరసపూర్, గౌతమి, బీదర్ ఎక్స్‌ప్రెస్‌లను నిలిపేయాల్సి వచ్చింది. కాగా రైళ్లకు వాటరింగ్ నింపే సౌకర్యం గుంటూరు, విజయవాడల్లో మాత్రమే ఉన్నది. పైన పేర్కొన్న రైళ్లలో నీళ్లు అయిపోవడంతో ప్రయాణికులు టాయ్‌లెట్స్‌కు వెళ్లలేక నరకయాతన పడ్డారు. దాంతో విష్ణుపురం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ఉదయం ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌కు అడ్డంగా నిలిచి కాసేపు రైల్‌రోకో కూడా చేశారు. అయినా ఎలాంటి ఫలితం లేకపోయింది. విష్ణుపురం - గుంటూరు సింగిల్ లేన్ రైలు మార్గం. ఈ రూట్‌లో ఇంటర్‌సిటీ, పల్నాడు, ఫలక్‌నుమా, వందేభారత్, జన్మభూమి, రేపల్లె ఎక్స్‌ప్రెస్ వంటివి ప్రయాణిస్తాయి. వీటి సమయపాలన దెబ్బతినకుండా చూసుకుంటూ దారి మళ్లించిన వాటిని విజయవాడకు తీసుకెళ్లడం చాలా కష్టం. ఈ కారణంగానే పైన పేర్కొన్న రైళ్లన్ని 12 గంటల ఆలస్యంగా గమ్యస్థానాలకు చేరుకున్నాయి. దాంతో నరసపూర్ ఎక్స్‌ప్రెస్‌ని నాలుగు గంటల పాటు రీషెడ్యూల్ చేయాల్సి వచ్చింది.

విఘ్ననాథా.. నమోస్తుతే

- జిల్లాకు వినాయక ఉత్సవ శోభ
- వర్షాన్ని లెక్కచేయకుండా ఏర్పాట్లు
- వాడవాడలా వెలిసిన గణనాథుల పందిళ్లు
- విగ్రహాలు, పత్రి విక్రయాలతో కూడళ్లు సందడి
- సత్తెనపల్లిలో 61 అడుగుల మట్టి మహా గణపతి



సత్తెనపల్లి నాగార్జుననగర్‌లో సిద్ధమవుతున్న 61 అడుగుల మట్టి వినాయకుడు



చిలకలూరిపేట షరాఫ్ బజారులో సిద్ధం చేసిన గవ్వల గణపయ్య విగ్రహం



గుంటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వర్షాలు వీడటంలేదు. కొన్ని ప్రాంతాల్లో వరదలు ముంచెత్తాయి. వినాయక చవితి సమీపించేంది. ఈ సారి విఘ్ననాయకుడి చవితికి వాన గండం తప్పదని భావించారు. కానీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడ చూసినా సందడే.. సందడి. వర్షాలు.. వరదలను ఏ మాత్రం లెక్క చేయకుండా జిల్లావ్యాప్తంగా ఘనంగా వినాయక చవితి పర్వదినం జరుపుకునేందుకు భారీగా ఏర్పాట్లు చేసుకున్నారు. జిల్లా అంతటా గణపతి ఉత్సవ శోభ సంతరించుకుంది. పల్లెలు, పట్టణాలలో వినాయక చవితి కోలాహలం నెలకొంది. గ్రామాలు, మున్సిపల్ పట్టణాల నుంచి జిల్లా కేంద్రాలైన గుంటూరు, నరసరావుపేట, బాపట్ల వరకు వాడవాడలా చవితి పందిళ్లు వెలిశాయి. చిన్నారులు నుంచి వృద్ధుల వరకు ఉత్సవాలలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. సినీ సెట్టింగ్ తరహాలో పందిళ్లను అందంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా పందిళ్లను శోభాయమానంగా అలంకరించారు. రంగురంగుల వస్త్రాలు, పూలు తదితరాలతో సుందరంగా అలంకరించారు. వినాయక మండపాలు విద్యుత్ కాంతులీనుతున్నాయి. విగ్రహ వేదికలను, మార్గాలను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. కొన్ని దగ్గర్ల శుక్రవారం మధ్యాహ్నానికే భారీ విగ్రహాలను కూడా కొలువుదీర్చారు. సత్తెనపల్లి పట్టణంలోని నాగార్జుననగర్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పర్యావరణ హితం, సామాజిక అభిమతం, మట్టి వినాయకుడిని పూజిద్దాం, పర్యావరణాన్ని రక్షిద్దాం అనే నినాదంతో 61 అడుగుల మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. బంక మట్టి, కొబ్బరిపీచు తదితరాలతో పర్యావరణానికి ముప్పు లేకుండా ఈ విగ్రహాన్ని తయారు చేశారు. ఈ విగ్రహం ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటుంది. చిలకలూరిపేట షరాఫ్‌బజార్ గణేష్ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో లక్షల బంగారు కోటింగ్ గవ్వలతో వినాయక విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా తయారు చేశారు. బంగారు గవ్వల గణపయ్య విగ్రహాన్ని తంజావూరు, కలకత్తా కళాకారులు రూపొందించారు. గుంటూరు అరండల్‌పేట 11/1వ లైనులోని శ్రీ రమా సహిత సత్యన్నారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో 40వ(చత్వారింశ) గణేష్ నవరాత్రులను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తెనాలిలోని విజయవాడ రోడ్డులో 60 అడుగుల భారీ గణపతి విగ్రహానికి ముచ్చట గొలిపే విధంగా రంగులతో తీర్చిదిద్దారు. ప్రతి వీధిలోనూ భక్తులు గణనాథుడ్ని కొలిచేందుకు సిద్ధం చేశారు. నరసరావుపేటలో వందల సంఖ్యలో భారీ విగ్రహాలను విక్రయించినట్లు తయరీదారులు తెలిపారు. తయారీదారుల నుంచి విగ్రహాలను ఊరేగింపుగా నిర్వాహకులు మండపాలకు తరలించారు. శనివారం గణపతి పూజలకు పందిళ్ల వద్ద ఏర్పాట్లు చేశారు. పూజల అనంతరం సాయంత్రం భక్తులు గణపతి విగ్రహాలను దర్శించుకునేందుకు వీలుగా కమిటీలు ఏర్పాట్లు చేశాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నది. శుక్రవారం కూడా పలు ప్రాంతాల్లో వర్షాలు పడగా తెరిపిచ్చిన సమయాన్ని నిర్వాహకులు వేడుకల పనుల కోసం కేటాయించారు. దీంతో జిల్లాలో శుక్రవారం ఎక్కడ చూసినా ఒకటే హడావుడి.. భక్తుల సందడి నెలకొంది. ఇక పలు ప్రాంతాల్లో మట్టిగణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని పరిక్షిద్దాం అనే నినాదాలతో కార్యక్రమాలు జరిగాయి. విద్యార్థులతో మట్టి ప్రతిమల తయారీ పోటీలు, ర్యాలీలు కార్యక్రమాలు జరిగాయి. వివిధ శాఖలు, సంస్థల ఆధ్వర్యంలో మట్టి గణపతుల విగ్రహాల పంపిణీలు విస్తృతంగా జరిగాయి. పందిళ్ల వద్ద వినాయక ఆలయాల్లో కూడా విఘ్నేశ్వర పూజలకు అర్చకులు ఏర్పాట్లు చేశారు.

ప్రధాన రహదారులన్నీ కిటకిట

జిల్లాలోని ప్రధాన రహదారులన్నీ శుక్రవారం వినాయక విగ్రహాలు, పత్రి విక్రయ దుకాణాలు వెలిశాయి. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ రోడ్లపై ప్రతిమలు తయారు చేసే వారు, పూజాసామగ్రి, పత్రి, మామిడి ఆకుల విక్రయాలను చేపట్టేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. మధ్యాహ్నం వర్షం పడగా సాయంత్రానికి తగ్గడంతో ప్రజలంతా ఒక్కసారిగా రోడ్ల మీదకు రావడంతో చాలా చోట్ల మార్కెట్లు కిక్కిరిసిపోయాయి.










గుంటూరులో వినాయకుడి ప్రతిమలు, పత్రి, సామాగ్రి కొంటున్న భక్తులు

భక్తులతో కిటకిటలాడుతున్న గుంటూరు మార్కెట్



మరోసారి.. సాగర్ గేట్లెత్తారు

- 20 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



20 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

మాచర్ల రూరల్, సెప్టెంబరు 6: నాగార్జున సాగర్ మళ్లీ తెరుచుకున్నాయి. గత వారం భారీ వర్షాలు.. శ్రీశైలం నుంచి పెద్దఎత్తున నీటి విడుదలతో సాగర్ గేట్లు పూర్తిగా తెరుచుకున్నాయి. శ్రీశైలం నుంచి నీటి విడుదల తగ్గడం.. వర్షాలకు విరామం రావడంతో సాగర్ గేట్లు మూసేశారు. తాజాగా శుక్రవారం ప్రాజెక్ట్ 22 క్రస్ట్ గేట్ల ద్వారా అధికారులు నీటిని విడుదల చేపట్టారు. 20 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 1,61,800 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపిస్తున్నారు. కుడి కాల్వ ద్వారా 8490, ఎడమ కాల్వ ద్వారా 3035, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,339, క్రస్ట్‌గేట్ల ద్వారా 1,61,800, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 600 మొత్తం ఔట్‌ఫ్లో 2,04,064 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 2,04,064 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

తేరుకున్నా.. కన్నీళ్లే

- కుళ్లిన పైర్లు.. ఆందోళనలో రైతులు
- సాయం కోసం బాధితుల ఎదురుచూపులు
- ముంపు గ్రామాలను ఆదుకోవడంపై క్షేత్రస్థాయి సర్వే

రేపల్లె, బాపట్ల, సెప్టెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): వరద గండం గట్టెక్కింది ప్రజలు మాత్రం కష్టాల సుడి గుండంలో అల్లాడుతున్నారు. ఈ కష్టాల నుంచి బయట పడే పరిస్థితి కనిపించడం లేదని బాధితులు ఆవేదన చెందుతున్నారు. అన్నదాతలను వరద నిండా ముంచేసింది. ఇళ్లన్నీ రోజుల తరబడి నీళ్లల్లోనే ఉండడంతో విలువైన సామాన్లతో పాటు అన్నీ తడిసి పనికిరాని స్థితికి చేరుకున్నాయి. నదీ తీర గ్రామాలు, లంకల్లో ఎటు చూసినా వరద మిగిల్చిన విషాదమే. వర్షపునీరు బయటకు పోవటంతో బయటపడిన పైర్లు పరిశీలిస్తే కొన్నిచోట్ల 90 శాతానికి పైగా కుళ్లిపోగా మరికొన్నిచోట్ల 50 శాతం పైర్లు పనికి రాకుండా పోయాయి. పైర్లు పరిశీలించిన రైతులు కన్నీరుపెట్టుకుంటున్నారు. మరలా నారుపోసి పెంచి నాటు వేయాలంటే పెట్టుబడి భారం మరింత పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి కష్టనష్టాలు చవిచూడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. కౌలు రైతుల పరిస్థితి అయితే మరింత దయనీయంగా మారింది. అప్పులు చేసి ముందుగానే కౌలు చెల్లించి ఇంజన్‌తో నీరుపెట్టి నాటు వేసి కొందరు, వెదపెట్టి మరికొందరు రైతులు ఇప్పుడు పూర్తిగా నష్టపోయారు. ముంపునకు గురై సర్వం కోల్పోయిన కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని 22 లంక గ్రామాల ప్రజలు ప్రభుత్వం అందించే సాయం కోసం ఎదురుచూస్తున్నారు. పసుపు, కంద పైర్లు ఒండ్రు మట్టితో నిండిపోయాయి. బొప్పాయి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కూరగాయ తోటలు పూర్తిగా కుళ్లిపోయి పనికి రాకుండా పోయాయి. పారిశుధ్య కార్యక్రమాల పనులు వేగవంతంగా సాగుతుండగా, ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసరాల కిట్ల పంపిణీ సరఫరా 85 శాతం పూర్తి కావచ్చినట్లు అధికారులు తెలిపారు. గృహాలకు జరిగిన నష్టంపై శరవేగంగా నివేదికలు రూపొందిస్తున్నారు. మరోవైపు ఛిద్రమైన రహదారులను త్వరగా బాగు చేసేందుకు ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖలు కసరత్తు చేస్తున్నాయి. గ్రామాలు విడిచి పునరావాస కేంద్రాలకు వెళ్లి తిరిగి వచ్చిన వారు ఇళ్లు, పరిసరాలను బాగు చేసుకునే పనిలో ఉన్నారు. బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్‌లు ఇలా ఎన్నో విలువైన పత్రాలు నీటపాలయ్యాయని బాధితులు ఆవేదన చెందుతున్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలేవీ పని చేసే స్థితిలో లేవని వాపోతున్నారు. 23 ముంపు గ్రామాలకు సంబంధించి 7,861 కుటుంబాలకు నిత్యావసరాల కిట్లను శుక్రవారానికి 85 శాతం పంపిణీ చేసినట్లు కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. పశువుల ఆకలిని తీర్చేందుకు 95 మెట్రిక్ టన్నుల దాణా పంపిణీ చేపట్టారు. వీటితో పాటు పశువులకు టీకాలను కూడా వేస్తున్నారు.



కొల్లూరు: కుళ్లిపోయిన వంగతోట




తెనాలి: కొత్తూరులంక దగ్గర కృష్ణానది వరద ప్రవాహానికి కోతకు గురవుతున్న భూములను పరిశీలిస్తున్న కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్, ఆలపాటి






రేపల్లె: వరద తగ్గటంతో గృహాలకు చేరుకుంటున్న పల్లెపాలెం వాసులు, మేక పిల్లలను తీసుకుని వెళుతున్న మహిళ







నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం



కొత్తూరులంకలో పంటలు దెబ్బతిన్నాయని కేంద్రమంత్రి పెమ్మసాని, మాజీ మంత్రి ఆలపాటికి చెబుతున్న రైతులు

కొల్లిపర, సెప్టెంబరు 6: వరద కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేస్తామనీ, అధైర్యపడవద్దని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలైన కొత్తూరులంక, అన్నవరంలంక, కనిగిరి లంక గ్రామాల్లో ఆయన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, జడ్పీ ఛైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టినా, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, సబ్‌కలెక్టర్ సంజనాసింహతో కలిసి పర్యటించారు. వరదకు దెబ్బతిన్న పసుపు, అరటి, కంద, నిమ్మ, కూరగాయల పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రకృతి విపత్తు వల్ల తలెత్తిన నష్టాన్ని , పంటలపై పెట్టిన పెట్టుబడి, పంటబీమా, ప్రత్యామ్నాయ పంటలు తదితర అంశాలపై రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ వరదల కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించామని, రైతులు భారీగా నష్టపోయారన్నారు. వరద కారణంగా నష్టపోయిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయమే కాకుండా అడిషినల్ ప్యాకేజీ ఇవ్వనున్నట్లు తెలిపారు. పంట నష్టం అంచనాలను వెంటనే తయారు చేయాలని అధికారులను ఇప్పటికే ఆదేశించినట్లు తెలిపారు. అన్నవరంలంక, కొత్తూరులంక గ్రామాల రైతులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. అన్నవరంలంక సమీపంలో వంతెనగాని, సప్టా గాని ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వ్యక్తిగతంగా ఉపశమనం ఉండే విధంగా రాష్ట్ర కూటమి ప్రభుత్వం ద్వారా అందరికీ న్యాయం చేయాలని చూస్తున్నట్లు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, టీడీపీ తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, నాయకులు గుడిబండి గోవర్ధనరెడ్డి, బొల్లు యోగానందవర్థి, తాతా అంజనేయులు, ఆలపాటి వెంకటేశ్వరరావు, పందిపాటి నల్లయ్య, భీమవరపు లంకకోటిరెడ్డి, సారథి, రవి, రమేష్, కౌసల్య, అప్పయ్య, వెంకట్రావు, శివన్నారాయణ పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత అభినందనీయం

వరద బాధితులకు స్వచ్ఛంద సంస్థలు తమ వంతు చేయూత అందించడం అభినందనీయమని కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తూరులంక, అన్నవరంలంక గ్రామాల్లో వరద బాధిత కుటుంబాలకు రెడ్‌క్రాస్, రోటరిక్లబ్ అందజేసిన నిత్యావసర సరుకులను ఆయన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, జడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, సబ్‌కలెక్టర్ సంజనాసింహాతో కలిసి పంపిణీ చేశారు. వరద బాధితుల సహాయార్థం మండల పరిధిలోని వల్లభాపురం గ్రామానికి చెందిన దుగ్గిరాల మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ వంగా సాంబిరెడ్డి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు రూ.50వేల చెక్కును అందజేశారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ వడ్లమూడి రవి, గుంటూరు రోటరీక్లబ్ అధ్యక్షుడు గాలి సుబ్బారావు, తెనాలి అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగ్గురి అరెస్టు : 8 బైకులు స్వాధీనం

చిలకలూరిపేట, సెప్టెంబరు 6: చిలకలూరిపేట అర్బన్ పోలీసులు ముగ్గురు బైక్ దొంగలను శుక్రవారం అరెస్టు చేసి వారి వద్ద నుంచి 8 బైకులను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన వారిలో చిలకలూరిపేటకు చెందిన కత్తి శివ, తన్నీరు ఉమాశంకర్, పెదనందిపాడుకు చెందిన ఒంటిపులి నరేంద్రబాబు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. చిలకలూరిపేట, యడ్లపాడు, బొప్పూడి, గణపవరం ప్రాంతాల్లో బైకులను దొంగిలించినట్లుగా పోలీసులు పేర్కొన్నారు. నిందితులు మూడు బైకులను అమ్మకం చేయడానికి సిద్ధంకాగా పోలీసులు పసిగట్టి వీరిని అరెస్టు చేశారు. అర్బన్ సీఐ పి.రమేష్ ఆధ్వర్యంలో ఎస్సై డి. చెన్నకేశవులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

విభిన్న రూపాయ.. వినాయక



పూల మొగ్గలతో గణపతి

విగ్రహాల తయారీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

చిలకలూరిపేట, సెప్టెంబరు 6: చిలకలూరిపేటలోని మోడరన్ స్టెల్లార్ స్కూలులో విద్యార్థులకు వినాయక విగ్రహాల తయారీ పోటీలను శుక్రవారం నిర్వహించారు. పర్యావరణానికి హాని కలగని పదార్థాలతో ఈ విగ్రహాలను తయారు చేయాలని విద్యార్థులకు సూచించారు. దీంతో పలువురు విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. పూల మొగ్గలతో, మట్టితో, గోధుమ పిండితో, బియ్యపు పిండితో, బిస్కెట్లతో, అగ్గిపుల్లలతో, కాయగూరలతో, దారాలతో, కాగితపు కప్పులతో, వివిధ రకాల ఆకులతో, సహజ రంగులతో, పప్పు దినుసులతో వినాయకుని విగ్రహాలను తయారు చేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థ ఛైర్మన్ చేబ్రోలు మహేష్, ప్రిన్సిపల్ దేవులపల్లి ఫణి కుమార్ పాల్గొన్నారు.



కాగితంతో..



బిస్కెట్లతో..



మట్టితో..



పూసలు, గొట్టాలు, సహజ రంగులతో..

డిసెంబర్‌లో విజ్ఞాన్‌లో అంతర్జాతీయ సదస్సు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 6: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో డిసెంబర్ 17, 18 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వైస్ ఛాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంతర్జాతీయ సదస్సుకు సంబంధించిన బ్రౌచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ అండ్ హార్టికల్చరల్ సైన్సెస్, అపారి (ఆసియా పసిఫిక్ అసోసియేషన్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్స్), యూరోపియన్ ప్లాంట్ హెల్త్ రీసెర్చ్ అండ్ కోఆర్డినేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో "ప్లాంట్ హెల్త్ ఇన్ ఆసియా : రీసెర్చ్ ప్రయారిటీస్ అండ్ పార్ట్‌నర్‌షిప్స్" అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా అపారి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రవి ఖేతర్‌పాల్, ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జాక్వెలైన్ డీఆరోస్ హంగెస్, ఐసీఆర్ఏఎఫ్ వరల్డ్ ఆగ్రోఫారెస్ట్రీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రవి ప్రభు, ఆంగ్రూ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి, డాక్టర్ వైఎస్ఆర్‌హెచ్‌యూ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.గోపాల్, పీపీఏఐ ప్రెసిడెంట్ డాక్టర్ బి.శరత్‌బాబు హాజరవుతారని తెలిపారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టర్స్ విడుదల చేస్తున్న వీసీ నాగభూషణ్ తదితరులు

10న శాస్త్రవేత్త నాయుడమ్మ స్మారక అవార్డు ప్రదానం



సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథబాబు, సుబ్రహ్మణ్యం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 6: భారతదేశం గర్వించదగిన శాస్త్రవేత్త దివంగత యలవర్తి నాయుడమ్మ స్మారక అవార్డు ప్రదానోత్సవం ఈ నెల 10న జరగనుందని కమిటీ ఛైర్మన్, టుబాకో బోర్డు మాజీ ఛైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు పేర్కొన్నారు. తెనాలిలో కుమార్ పంప్స్ ఆవరణలో శుక్రవారం అవార్డు ప్రదానోత్సవ కరపత్రాలను విడుదల చేశారు. ఈ నెల 10న తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో అవార్డు ప్రదానం జరుగుతుందన్నారు. తమిళనాడుకు చెందిన నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. ప్రసన్నకుమార్‌ను అవార్డుకు ఎంపిక చేశామని చెప్పారు. గతంలో నాయుడమ్మ అవార్డును ఎంతోమంది సైంటిస్టులకు అందజేశారు. అవార్డు కమిటీ జ్యూరి విభాగం ఈ ఎంపిక చేసినట్లు చెప్పారు. నాయుడమ్మ జయంతి పురస్కరించుకుని పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. అవార్డు ప్రదానోత్సవంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిథిగా, చెన్నైకు చెందిన పీఎల్ఆర్ఐ సైంటిస్టు డాక్టర్ స్వర్ణకాంత్ పాల్గొంటారని చెప్పారు. కమిటీ వైస్ ఛైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, అరవిందఘోష్ పాల్గొన్నారు.

లీవ్ లెటర్ రాసివ్వాల్సిందే.. లేదంటే రానట్టే

గుంటూరు, సెప్టెంబరు 6: బస్సుల్లేవు.. మీరంతా లీవ్ లెటర్లు రాసిచ్చి వెళ్లిపోండి.. ఇది గుంటూరు-1 , 2 డిపో అధికారులు వ్యవహరిస్తోన్న తీరు. శుక్రవారం కూడా అధికారులు ఇదేవిధంగా వ్యవహరించటంపై సిబ్బంది ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఇటీవల వరదలతో ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ఎన్నడూ లేనివిధంగా వరద నీరు ముంచెత్తిన విషయం తెలిసిందే. ఫలితంగా అనేక బస్సులు సాంకేతిక లోపంతో ఎక్కడికక్కడ మొరాయిస్తున్నాయి. బస్టాండ్‌లోని గుంటూరు-1, 2 డిపోల్లో అధికారుల వైఖరి కొత్త వివాదానికి దారితీస్తుంది. 30 సర్వీసులకు పైనే గ్యారేజ్‌లకే పరిమితమయ్యాయి. అయితే విధులకు హాజరైన ఉద్యోగులకు డ్యూటీలు వేయకుండా డిపో అధికారులు లీవ్ లెటర్లు రాయమనటం వివాదాస్పదమవుతోంది. మూడు రోజులుగా ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో రెండు డిపోల్లోనూ ఇదే వ్యవహారం జరుగుతోందని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిపోకు హాజరైన డ్రైవర్, కండక్టర్లును లీవ్ లెటర్లు రాసివ్వాలని లేదంటే మీరు రానట్లే లెక్కగా రాస్తామని కొందరు అధికారులు బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా డిపో అధికారుల వైఖరిపై కొందరు ఉద్యోగులు జిల్లా ప్రజా రవాణాధికారి రవికాంత్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులతో మాట్లాడతానని, సిబ్బంది నుంచి బలవంతపు లీవ్ లెటర్ తీసుకుంటే ఊరుకోమని ఆయన సమాధానం చెప్పినట్లు సమాచారం. అయితే ఇదే వ్యవహారంపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో ఉద్యోగులకు బలవంతపు లీవ్ అంటూ ఉప శీర్షికతో వెలువడిన కథనం ఆర్టీసీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే విధులకు హాజరైన డ్రైవర్, కండక్టర్స్‌లో కొందరు అధికారులు తమ అస్మదీయులకు మాత్రం హాజరు వేస్తున్నారంటూ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

ఈపూరు, సెప్టెంబరు 6: మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచినందుకు షాపు డీలర్ కె.శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం ఉమామహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు గురువారం రేషన్ షాపుపై దాడి చేయగా దండే సురేష్‌కు చెందిన గదిలో 36 బస్తాల రేషన్ బియ్యం ఉన్నాయి. ఆ బియ్యం బస్తాలు శ్రీనివాసరావు షాపు నుంచి అక్కడకు తరలించినట్లు గుర్తించారు. వీఆర్వో షేక్ అబ్దుల్ నబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దాడుల్లో వీఆర్ఏ జాన్‌సైదా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నకరికల్లు, సెప్టెంబరు 6 : ఎదురెదురుగా బైక్‌లు ఢీకొనటంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన పిడుగురాళ్ళ - ఓడరేవు రహదారిలో మాచవరం అడ్డరోడ్డు సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నకరికల్లు గ్రామానికి చెందిన కండకుంట వెంకటేష్ బైక్‌పై వెళ్తుండగా, ఎదురుగా మరో బైక్‌పై నకరికల్లుకు చెందిన షేక్ బాజీ, రాజుపాలెం మండలం ఇనిమెట్ల గ్రామానికి చెందిన సంగం కోటేశ్వరరావు ఎదురెదురుగా రావటంతో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నకరికల్లుకు చెందిన కండ్లకుంట వెంకటేష్(23) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బైక్ పై ప్రయాణిస్తూ తీవ్రంగా గాయపడిన సంగం కోటేశ్వరరావు, షేక్ బాజీ నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ అధికారులు, సిబ్బందికి రివార్డులు

గుంటూరు, సెప్టెంబరు 6: నాలుగు హత్యలు, మూడు హత్యాయత్నం కేసులను ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అభినందించారు. చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రాంతంలో ఈ ఏడాది జూన్ 13న గుర్తుతెలియని మహిళ మృదేహం కేసు, 2022లో ప్రకాశం జిల్లా మార్కాపురంలో సుబ్బలక్ష్మి (65) హత్య కేసు, తెనాలికి చెందిన నాగమ్మ (65) హత్య కేసు, తెనాలికి చెందిన పీసు అలియాస్ మోషె హత్య కేసు తోపాటు 2022 డిసెంబర్‌లో తెనాలిలో వలంటీర్ అన్నపూర్ణ, 2023లో తెనాలికి చెందిన మురుగప్ప వరలమది, 2023 తెనాలికి చెందిన షేక్ మీరాబీ హత్యాయత్నం కేసులను పోలీసులు ఛేదించారు. ఈ కేసుల్లో వెంకటేశ్వరి అలియాస్ బుజ్జి, ఆమె తల్లి రమణమ్మ ముద్దాయిలుగా తేల్చారు. కేసులను ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ప్రశంసా పత్రాలు అందజేశారు. తెనాలి డీఎస్పీ బి.జనార్దన్ రావు, పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, సైబర్ సెల్ సీఐ షేక్ మౌలా షరీఫ్, చేబ్రోలు ఎస్సై దండా వెంకట కృష్ణ, తెనాలి త్రీటౌన్ ఎస్సై ఎస్.ప్రకాష్‌రావు, ఐటి కోర్ హెడ్ కానిస్టేబుల్ జి.బాలాజీ, ఐటి కోర్ కానిస్టేబుల్ ఎస్.శ్రీధర్, పొన్నూరు రూరల్ కానిస్టేబుల్ బీవీ శివయ్య, చేబ్రోలు కానిస్టేబుళ్లు ఏ. అప్పలనాయుడు, ఎస్.ధర్మరాజు, కె.రాము, డీసీఆర్‌బి జూనియర్ అసిస్టెంట్ పి శ్రీనివాసరావు రివార్డులు అందుకున్నారు.

గుంటూరు మీదగా సికింద్రాబాద్ - బ్రహ్మపూర్ ప్రత్యేక రైళ్లు

గుంటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాబోయే పండగల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా సికింద్రాబాద్ - బ్రహ్మపూర్ - సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. నంబరు. 07027 సికింద్రాబాద్ - బ్రహ్మపూర్ రైలు ఈ నెల, అక్టోబరు, నవంబరు నెలల్లో ప్రతీ శుక్రవారం రాత్రి 8.15కి బయలుదేరి 11.45కి సత్తెనపల్లి, అర్ధరాత్రి దాటాక 12.45కి గుంటూరు, శనివారం మధ్యాహ్నం 2.45కి బ్రహ్మపూర్ చేరుకొంటుంది. నంబరు. 07028 బ్రహ్మపూర్ - సికింద్రాబాద్ రైలు ఆయా నెలల్లో ప్రతీ శనివారం సాయంత్రం 4.45కి బయలుదేరి ఆదివారం వేకువజామున 4.30కి గుంటూరు, 5.23కి సత్తెనపల్లి, ఉదయం 11.35కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. పైన రెండు రైళ్లు 13 ట్రిప్పులు చొప్పున ప్రయాణిస్తాయి. కాగా నంబరు. 07097 సికింద్రాబాద్ - విశాఖపట్టణం ప్రత్యేక రైలు ఈ నెల, అక్టోబరు, నవంబరుతో పాటు డిసెంబరులో మొదటి వారం వరకు ప్రతీ ఆదివారం సాయంత్రం 4.35కి బయలుదేరి రాత్రి 8.10కి సత్తెనపల్లి, 9.30కి గుంటూరు, సోమవారం ఉదయం 6.30కి విశాఖపట్టణం చేరుకొంటుంది. నంబరు. 07098 విశాఖపట్టణం - సికింద్రాబాద్ రైలు పైన పేర్కొన్న నెలల్లో ప్రతీ సోమవారం రాత్రి 7.50కి బయలుదేరి మంగళవారం వేకువజామునకు ముందు 2.25కి గుంటూరు, 3.20కి సత్తెనపల్లి, ఉదయం 11.15కి సికింద్రాబాద్ చేరుకొంటుంది.

ఇంటర్‌లాకింగ్ పనులతో రైళ్ల రద్దు

గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా గిద్దలూరు - దిగువమెట్ట మధ్యన నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా రైళ్లను రద్దు చేసినట్లు డీఆర్ఎం తెలిపారు. ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు నంబరు. 17251 గుంటూరు - కాచీగూడ, 17228 గుంటూరు - డోన్, 12 నుంచి 21వ వరకు 17252 కాచీగూడ - గుంటూరు, 17227 డోన్ - గుంటూరు, 17 నుంచి 20వరకు 17261 గుంటూరు - తిరుపతి, 18 నుంచి 21 వరకు 17262 తిరుపతి - గుంటూరు, 17253 గుంటూరు - ఔరంగబాద్, 19 నుంచి 22 వరకు 17254 ఔరంగబాద్ - గుంటూరు రైళ్లను రద్దు చేశామన్నారు. నంబరు. 22831 హౌరా - శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం రైలుని ఈ నెల 18న కృష్ణాకెనాల్ నుంచే గూడూరు, రేణిగుంట మార్గంలో మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోండి


నీటమునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 6 : జిల్లాలోని రైతులు సాగుచేసిన పంటలను ఈ క్రాఫ్ లో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి నున్న వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తెనాలి, పొన్నూరు మండలాల్లో నీట మునిగిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చాలా వరకు వరద నీరు పొలాల నుంచి బయటకు వెళ్ళిపోయిందని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో మాత్రం పంటలు ఇంకా ముంపులోనే ఉన్నాయన్నారు. ఈ నెల 18 నాటికి వరద వల్ల స్తంభించిన పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకూ ఇన్ పుట్ సబ్సిడీ అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ-క్రాప్‌లో పంట వివరాలు నమోదు కాకపోతే ఇన్‌పుట్ సబ్సిడీ రాదని అన్నారు. ఇప్పటికే 95 శాతం ఈ క్రాప్ నమోదు జరిగిందని వివరించారు.

గుండె తరుక్కుపోతోంది: జడ్పీ చైర్‌పర్సన్


తెనాలి మండలంలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 6 : వరదలో మునిగిపోయిన పంట పొలాలు చూస్తుంటే గుండె తరుక్కుపోతోందని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. శుక్రవారం తెనాలి మండలంలోని కొలకలూరు, హాఫ్ పేట, కాజీపేట గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నష్టపోయిన రైతులతో జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు పూర్తిగా పాడయ్యాయని రైతులు తెలిపారు. రైతుల బాధ, ఆవేదనను ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రి, మంత్రి మనోహర్ దృష్టికి తీసుకువెళ్తామని రైతులకు ఆమె హామీ ఇచ్చారు.

సహాయక చర్యల్లో అంకితభావంతో విధులు నిర్వహించాలి


విజయవాడలోని వరద ముంపు ప్రాంతంలో ట్రాక్టర్ పై పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 6 : వరద ప్రభావిత ప్రాంతాల చేపట్టిన సహాయక చర్యల్లో సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహించాలని, సిబ్బందికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తగు చర్యలు తీసుకుంటామని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. విజయవాడలోని 62వ డివిజన్లోని ఎల్బీఎస్‌నగర్, పటేల్ నగర్, లక్ష్మీ నగర్, ప్రకాష్‌నగర్ మెయిన్ రోడ్, రాధా నగర్ తదితర ప్రాంతాల్లో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనులను శుక్రవారం క్షేత్ర స్థాయిలో ఆయన ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విజయవాడ నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనుల కోసం వివిధ మున్సిపాలిటీల నుండి హాజరైన కార్మికులు, సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహించాలన్నారు. వరదలకు నిలిచిన వ్యర్థాలను, వరద తగ్గిన ప్రాంతాల్లోని ఇళ్లల్లో ఉన్న వ్యర్థాలను సేకరించాలని ఆదేశించారు.

మన్నవ మోహనకృష్ణకు సన్మానం


మన్నవ మోహనకృష్ణను సన్మానిస్తున్న పల్లా శ్రీనివాసరావు

గుంటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు శుక్రవారం సన్మానించారు. ఆపత్కాలంలో తన చారి టబుల్ ట్రస్టు ద్వారా వరద బాధి తులకు అండగా నిలిచిన ఆయనను పార్టీ కేంద్ర కార్యాలయంలో సత్కరించారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

● బ్రోచర్ ఆవిష్కరించినఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతి యువకుడు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పిలుపునిచ్చారు. మెగా జాబ్ మేళా బ్రోచర్‌ను శుక్రవారం టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో హెచ్‌ఆర్ అండ్ కో ప్రతినిధులు, కూటమి నేతలతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో మొదటిసారిగా ఈ జాబ్ మేళాను నిర్వహించబోతున్నామని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షలకు అనుగుణంగా చదువుకున్న ప్రతి యువతకు ఉద్యోగం కల్పించటం లక్ష్యంగా పెట్టుకున్నామని అందులో భాగంగా హెచ్‌ఆర్ అండ్ కో కంపెనీ సహకారంతో నియోజకవర్గంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామనీ, విద్యార్హతతో సంబంధం లేని వ్యక్తి దగ్గర నుంచి ఉన్నత చదువులు చదువుకున్న వారి వరకూ ప్రతి ఒక్కరికీ ఉపాధి కలిపించటమే ఈ మెగా జాబ్ మేళా లక్ష్యమన్నారు. ఈ జాబ్ మేళా లో పాల్గొనదలచిన నిరుద్యోగులు తమ పేర్లను ఆన్ లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలనీ సూచించారు. త్వరలో జాబ్ మేళా తేదీని ప్రకటిస్తామని ఆమె అన్నారు. కూటమి నేతలు తమ డివిజన్ లలో చదువుకున్న యువతను గుర్తించి, వారిని ఈ మెగా జాబ్ మేళాలో భాగ స్వామ్యం చేయాలన్నారు. ఈ మెగా జాబ్ మేళాకు ఏటువంటి రుసుము లేదని, తాను సొంత ఖర్చులతో నిర్వహిస్తున్నానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో జనసేన నేత బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, టీడీపీ నేతలు కోవెలమూడి రవీంద్ర, డేగల ప్రభాకర్ బీజేపీ నేతవనమా నరేంద్ర, కొమ్మినేని కేటేశ్వరరావు చెరుకూరి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చీరలు, దుప్పట్లు

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపు మేరకు న్యాయవాది శివలీల విజయవాడ వరద బాధితుల కోసం చీరలు, దుప్పట్లు అందజేశారు. టీడీపీ నాయకుడు చిట్టిప్రోలు లోకేశ్వరావు రూ. 10 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా శివలీలను ఎమ్మెల్యే అభినందించారు. ఇదే స్ఫూర్తితో దాతలు అందరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే కోరారు. సేకరించిన విరాళాలను 8వ తేదీన విజయవాడలో వరద బాధితులకు పంపిణీ చేస్తామన్నారు.

ఉన్నత విద్యామండలి నిర్లక్ష్యంతోనే విద్యార్థి మరణం

● ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 6: ఉన్నత విద్యా మండలి ఇన్‌ఛార్జి చైర్మన్, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఒక విద్యార్థి ప్రాణం కోల్పోయాడని, వారిపై చర్యలు తీసుకోవాలని అఖిలభారత యువజన సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డిగ్రీ అడ్మిషన్లు రెండో విడతలో భాగంగా ఆగస్టు 29వ తేదీన సీట్లు కేటాయించారని, సీటు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 3 నాటికి రిపోర్ట్ చేయాలని ఉన్నత విద్యాశాఖ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఆగస్టు 31వ తేదీ నుండి రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసినప్పటికీ ఉన్నత విద్యాశాఖ సెలవు ప్రకటించలేదని తెలిపారు. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన విద్యార్థి కొడాలి యశ్వంత్ కుమార్ వన్ టౌన్‌లోని కేబీఎన్ కళాశాలలో అడ్మిషన్ వచ్చింది. తప్పనిసరి పరిస్థితుల్లో కాలేజీలో రిపోర్ట్ చేసేందుకు మంగళవారం పడవల సాయంతో వెళ్లే క్రమంలో గల్లంతైన విద్యార్థి మరణించాడని ఆరోపించారు. విద్యార్థి మృతికి కారకులపై కేసు నమోదు చేయాలని, అతని కుటుంబానికి ఎక్స్ గేషియా కింద రూ. 25 లక్షలు ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


రాధాకృష్ణన్‌కు నివాళులర్పిస్తున్న డాక్టర్ సయ్యద్ రసూల్

ఎంత ఎదిగినా గురువులను మర్చిపోవద్దు

● 'మదర్ కేర్'లో టీచర్స్ డే వేడుకలు

గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 6: జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా తమకు చక్కటి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను జీవితంలో ఎప్పటికీ మర్చిపోవద్దని, వారిని గౌరవించాలని కేర్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ సయ్యద్ రసూల్ ఉద్బోధించారు. సిస్టర్ కేర్ నర్సింగ్ స్కూల్‌లో బుధవారం రాత్రి జరిగిన ఉపాధ్యాయుల దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తొలుత మాజీ ఉపరాష్ట్రపతి దివంగత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం నేటి తరానికి ఆదర్శమని డాక్టర్ రసూల్ తెలిపారు. అనంతరం నర్సింగ్ విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్న నర్సింగ్ విద్యార్థినులు తమ నృత్య ప్రదర్శనలతో అందరిని అలరించారు. కార్యక్రమంలో నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణ కుమారి, జీవతార, మొయినుద్దీన్, సమీర, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ' ఆధ్వర్యంలో నిత్యావసరాలు పంపిణీ

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 6 : విజయవాడలో ని వరద బాధితులను ఆదుకునేందుకు గుంటూరుకు అమ్మ చారిటబుల్ ట్రస్టు ముందుకు వచ్చింది. శుక్రవారం విజయవాడలో ని సింగ్ నగర్, వైఎస్సార్ కాలనీ, కండ్రిక లో ట్రస్టు ఆధ్వర్యంలో నిల్వ ఉండే నిత్యావసరాలు,ఆహారపు పొట్లాలు పంపిణీ చేశారు. ఐదు వేల చపాతీలు, రొట్టెలు, రస్కులు,పదివేల కొవ్వొత్తులు, దోమల కాయిల్స్‌వాటర్ ప్యాకెట్లు అందజేశారు. మూడు, నాలుగు అడుగుల లోతు నీళ్లు నిలబడిన ప్రాంతాల్లో కి సైతం వెళ్ళి నిత్యావసరాలు అందజేసినట్లు ట్రస్టు సేవకులు తెలిపారు.స్వామి జ్ఞాన ప్రసన్న ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు. అక్కడున్న ప్రజలకు ప్రస్తుత పరిస్థితుల్లో మందులు , మహిళలకు శానిటరీ న్యాప్ కిన్స్ అవసరం అని త్వరలోనే వాటిని కూడా పంపిణీ చేస్తామని చెప్పారు.


విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో నిత్యావసరాలు అందజేస్తున్న అమ్మ చారిటబుల్ ట్రస్టు సేవకులు





పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కే ఎస్ లక్ష్మణరావు, పాల్గొన్న సీఐటీయూ నాయకులు

10న పంచాయతీ కార్మికుల సదస్సును జయప్రదం చేయండి

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 6: ఈ నెల 10న పాత గుంటూరులోని సీఐటీయూ కార్యాలయంలో జరిగే పంచాయతీ కార్మికుల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బ్రాడీపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్రం నుంచి పంచాయతీలకు కావాల్సిన నిధులు పోరాడి తెచ్చేందుకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషి చేయాలని కోరారు. పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వైనేతాజీ మాట్లాడుతూ పంచాయితీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జరిగే రాష్ట్ర స్థాయి సదస్సులో పంచాయతీ కార్మికులు ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డీ లక్ష్మీనారాయణ, బీ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.






చెక్కును మంత్రి లోకేశ్‌కు అందజేస్తున్న పాతూరి శ్రీనివాసరావు

వరద బాధితులకు రూ.5 లక్షల సాయం

మంగళగిరి, సెప్టెంబరు 6: వరద బాధితుల సహాయార్థం మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామానికి చెందిన టీడీపీ నేత పాతూరి శ్రీనివాస రావు రూ.5 లక్షలను ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. ఈ చెక్కును శుక్రవారం విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగ భూషణం, టీడీపీ నేతలు అన్నే శరత్, చల్లపల్లి కిరణ్, గడ్డిపాటి సాంబశివ రావు, వున్నం నాని, వల్లూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


మగ్గం గుంతలో చేరిన నీటిని తోడుతున్న చేనేత కార్మికురాలు అనురాధ

తేరుకుంటున్న ముంపు ప్రాంతాలు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 6: భారీ వర్షాల కారణంగా ముంపుకు గురైన లోతట్టు ప్రాంతాలు, శివారు కాలనీలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. గత నాలుగు రోజుల నుంచి వర్షం తగ్గుముఖం పట్టడంతో రత్నాలచెరువు, ఎస్టీ కాలనీ తదితర ప్రాంతాల్లో వరద నీరు తగ్గిపోయింది. చేనేత మగ్గాల గుంతల్లోకి నీళ్లు చేరడంతో కార్మికులు ఉపాధి కోల్పోయారు. మగ్గం గుంతల్లో నీటిని తోడుతున్నప్పటికీ మళ్లీ ఊట ఊబికి వస్తుంది. ఉపాధి కోల్పోయిన చేనేత కుటుంబాలకు ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందుతున్నాయి.

వరద బాధితులకు దాతల చేయూత

- సీఎం సహాయ నిధికి శర్వాణి ఇండస్ట్రీస్ రూ.10లక్షల విరాళం
- జోసిల్ సంస్థ రూ. 2లక్షల విలువైన ఆహార పదార్థాల అందజేత

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 6: శర్వాణి ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గోపాల్‌రెడ్డి వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి రూ.10లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం గోపాల్‌రెడ్డి జనచైతన్య రాష్ట్ర వేదిక అధ్యక్షుడు వల్లం రెడ్డి లక్ష్మణ రెడ్డితో కలిసి శుక్రవారం తాడేపల్లిలోని విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఆయన నివాసంలో కలిసి రూ.10లక్షల చెక్కు అందజేశారు. ఈసందర్భంగా లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్ర బాబు, మంత్రులు, అధికార యంత్రాంగం ప్రజాప్రతినిధులు అహర్ని శలూ కృషి చేస్తూ వరద బాధితులకు యుద్ధ ప్రాతిపదికన సహాయం అందించడం హర్షణీయమన్నారు.

మేడికొండూరు : వరద బాధితుల సహాయార్థం మేడికొండూరు మండలంలోని డోకిపర్రులో గల జోసిల్ లిమిటెడ్ సంస్థ రూ.2 లక్షల విలువైన బిస్కట్ ప్యాకెట్‌లను శుక్రవారం అందించి తమ వితరణ చాటుకుంది. కలెక్టర్, జిల్లా పరిశ్రమల కేంద్రం సమన్వయంతో తాడికొండ నియోజక వర్గంలోని తుళ్లూరు, తెనాలి నియోజకవర్గం కొల్లిపర గ్రామాలలోని వరదలలో చిక్కుకుపోయిన వారికి కంపెనీ వాహనాలలో ఆయా గ్రామాలకు తరలించి అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ కార్యదర్శి డీజీఎం కే.రఘురామ్, సీనియర్ మేనేజర్ బీ. శేషగిరిరావు, ఎన్. కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అదే విధంగా మేడికొండూరు మండలంలోని డోకిపర్రు గ్రామానికి చెందిన శుభమ్ డెవలపర్స్ చైర్మన్ అజ్మతుల్లా వరద బాధితుల తనవంతుగా రూ.లక్ష చెక్కును తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ కుమార్ ద్వారా శుక్రవారం సీఎం సహాయనిధికి అందజేశారు.


మంత్రి గొట్టిపాటి రవికి చెక్కు అందజేస్తున్న గోపాల్‌రెడ్డి, లక్ష్మణరెడ్డి

తాడేపల్లి: మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో తెలుగు యువత గుంటూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జంగాల వెంకటేష్, లింగంశెట్టి అసోసియేట్స్ అధినేత లింగంశెట్టి కిషోర్ దాతల సహకారంతో విజయవాడలోని వరద బాధితులకు 500 వాటర్ టిన్నులు, 500 వాటర్ బ్యాగ్‌లు, 5 వేల బిస్కెటు ప్యాకెట్లు అందించారు. ఉండవల్లి సెంటర్ నుండి విజయవాడ సింగ్‌నగర్, వాంబే కాలనీ, సితార సెంటర్ ప్రాంతాలకు తీసుకువెళ్లి బాధితులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాదె శ్రీనివాసారవు, పెండ్యాల వెంకటరావు, పసుపులేటి శ్రీనివాసరావు, కోటి, నరేష్, లీలాకృష్ణ, సాంబశివరావు, శివరామ్, శ్రీను పాల్గొన్నారు.


బిస్కెట్ ప్యాకెట్‌లను అధికారులకు అందజేస్తున్న జోసిల్ ఉద్యోగులు


ఎమ్మెల్యే శ్రావణ కుమార్‌కు చెక్కును అందజేస్తున్న అజ్మతుల్లా

ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి

- సముద్రంలోకి 1 లక్ష 40వేల 625 క్యూసెక్కులు
- డెల్టా కాలువలకు 202 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 6: ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుండి ప్రధాన వాగుల నుండి బుధవారం 1లక్ష 40వేల 827 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జెఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.2 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 30 గేట్లను 4 అడుగుల మేర, 33 గేట్లను 3 అడుగుల మేర ఎత్తి దిగువకు 1లక్ష 40 వేల 625 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 202 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.


ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

పిల్లలు భిక్షాటన చేస్తే సమాచారమివ్వండి

దుగ్గిరాల, సెప్టెంబరు 6: బడిలో ఉండాల్సిన పిల్లలు ఎవరైనా భిక్షాటన చేస్తూ కనిపిస్తే తక్షణమే తమకు ఫోన్‌చేసి సమాచారం అందించాలని రైల్వేప్రొటెక్షన్ ఫోర్స్ తెనాలి సబ్‌ఇన్‌స్పెక్టర్ వీ. గిరయ్య అన్నారు. స్థానిక జడ్పీబాలురహైస్కూల్‌లో రైల్వేచైల్డ్‌హెల్ప్‌లైన్, రైల్వేప్రొటెక్షన్ ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో బాలల హక్కులపై ఇన్‌చార్జి హెచ్‌ఎం జీ. ఉమాదేవి అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో గిరయ్య పాల్గొన్నారు. గిరయ్య మాట్లాడుతూ, ప్లాట్‌ఫారంపైన, రైల్వే బ్రిడ్జిలపైన ఫోటోలు దిగే ప్రయత్నం చేయవద్దని అన్నారు. బాలల అక్రమ రవాణా రైళ్లలో పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మొబైల్‌ఫోన్‌లు, గంజాయి వంటి మత్తుపదార్థా లకు బానిసలు కావద్దని హెచ్చరించారు. బాలకార్మికత నిర్మూలించాలని, పలువురు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద ప్రాతాల్లో పంటల పరిశీలన

కాకుమాను, సెప్టెంబరు 6 : మండల పరిధిలోని కొల్లిమర్ల, కేబీ పాలెం, చిన్నలింగాయపాలెం గ్రామాలలో శుక్రవారం జిల్లా వ్యవసాయ శాఖాధికారి నున్నా వెంకటేశ్వర్లు పొన్నూరు సబ్‌డివిజన్ ఏడీఏ రామ కోటేశ్వరి, ఏవో కిరణ్మయితో కలసి వరద ప్రభావిత ప్రాంతాలలో వరి పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ.. నీటిలో మునిగిన వరి పైరు మూడు రోజుల నుంచి ఐదు రోజుల వరకు తట్టుకుంటుందన్నారు. పొలంలో నీరు బయటకు వెళ్లిన తర్వాత 30 కిలోల యూరియా, 15 కిలోల ఎంఓపిలను వేసుకోవాలన్నారు. వరద ప్రభావంతో మొక్కలు దెబ్బతిన్న చోట మళ్లీ వరి పెట్టుకోవాలన్నారు. అన్ని రైతు సేవా కేంద్రాలలో ఈ క్రాఫ్ బుకింగ్ జరుగుతుందని రైతులు తప్పనిసరిగా ఈ క్రాఫ్ బుకింగ్ చేసుకోవాలన్నారు. అనంతరం ఈ కేవైసీ చేయించాలని వీఏఏలను ఆదేశించారు. అలాగే వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టం అంచానాలు సిద్ధం చేసి నివేదికలను ఉన్నతాధికారులకు పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్మల ఫార్మసీలో ఇంటర్నల్ హాకథాన్ -2024

మంగళగిరి, సెప్టెంబరు 6: మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఇంటర్నల్ హాకథాన్-2024 నిర్వహించారు. స్మార్ట్ ఇడియా హాకథాన్‌కు ప్రాథమిక పరీక్షగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ జీ. నిర్మల జ్యోతి తెలిపారు. మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ అంగీకృత ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో జరిగే స్మార్ట్ ఇండియా హాకథాన్‌కు గెలుపొందిన బృందాలు ఎంపిక అవుతాయని, మొత్తం 36 బృందాలు ఇంటర్నల్ హాకథాన్‌లో పాల్గొని వివిధ అంశాల్లో సాంకేతిక పరిష్కారాలను ప్రతిపాదించాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.పాములరెడ్డి, ఐఐసీ కోఆర్డినేటర్ డాక్టర్ షేక్ ఆషా బేగం, ఐపీఆర్‌సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ జీ.స్వప్న, ప్రశాంతి, శాంతి పాల్గొన్నారు.


సమావేశంలో ఏపీ అటవీ శాఖ, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ప్రతినిధులు

పాపికొండల ఉద్యానవనంపై అధ్యయనం

- అటవీ శాఖ, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ మధ్య ఒప్పందం

మంగళగిరి సిటీ,సెప్టెంబరు6: పాపికొండల జాతీయ ఉద్యానవనంపై అధ్యయనం చేసేందుకు ఏపీ అటవీ శాఖ, వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ సంస్థల మధ్య పరస్పర ఒప్పందం కుదిరింది. ఈ మేరకు మంగళగిరిలోని అరణ్య భవన్‌లో అటవీ శాఖ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి, వైల్డ్ లైఫ్ పీసీసీఎఫ్ ఏకే నాయక్ శుక్రవారం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. పాపికొండల నేషనల్ పార్కు భూభాగంలో అయిదేళ్లపాటు వన్యప్రాణులు, వాటి ఆవాసాల పరిరక్షణకు సంబంధించి ఆర్థికేతర ఒప్పందం చేసుకున్నారు. జీవ వైవిధ్యాన్ని సంరక్షించడంతోపాటు సహజ వారసత్వాన్ని కాపాడుకునేందుకు రెండు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు ఆర్పీ ఖజూరియా, ఎస్ఎస్ శ్రీధర్, రేవతి మనోహరన్, డాక్టర్ శాంతిప్రియ పాండే, రాహుల్ పాండే తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలోనూ జై జగన్ నినాదాలు

- ఇబ్బందిపడిన కక్షిదారులు

మంగళగిరి, సెప్టెంబరు 6: మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను గురువారం మంగళగిరి రూరల్ పోలీసులు రిమాండ్ నిమిత్తం కోర్టుకు తీసుకురాగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. రిమాండ్ అనంతరం నందిగం సురేష్ బయటకు వస్తుండగా పలువురు వైసీపీ శ్రేణులు సురేష్ వెంట వస్తూ కోర్టు ప్రాంగణంలోనే జై జగన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో కోర్టుకు వచ్చిన కక్షిదారులు కోర్టులో ఇదేం గోల అంటూ వ్యాఖ్యానించారు. కోర్టుక వచ్చినప్పుడు నియబద్ధంగా ఉండాల్సిన నేతలు తమ వారిని వారించాల్సి ఉన్నప్పటికీ నినాదాలు చేస్తున్న వారించకుండా నవ్వుకుంటూ బయటకు రావడం గమనార్హం. సంబంధిత పోలీసు సిబ్బంది కూడా ఇటువంటి చర్యలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కక్షిదారులు కోరుతున్నారు.


పశువుల దాణాను అందిస్తున్న నేతలు, అధికారులు

చిర్రావూరులో పశువుల దాణా పంపిణీ

తాడేపల్లి, సెప్టెంబరు 6: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కృష్ణానదిలో వరద ఉధృతంగా రావడంతో చిర్రావూరు గ్రామంలోని లంక ప్రాంతంలోని పశువుల దాణాకు ఇబ్బందిగా మారింది. ఈ సమస్య లను ఐటీ, విద్యా శాఖామంత్రి నారా లోకేశ్‌కు తెలియజేయగా వెంటనే స్పందించిన మంత్రి లోకేశ్ టిఎంఆర్ పశువుల దాణా 75 టన్నులు పంపించారు. దీంతో ప్రతి గేదెకు 50 కేజీల దాణా చొప్పున రైతులకు ఉచితంగా పంపిణీ చేసినట్టు టీడీపీ గ్రామ అధ్యక్షుడు వీరిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. లైబ్రరీ సెంటర్‌లో సుమారు 75 టన్నుల పశువుల దాణా మంగళగిరి సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు, తాడేపల్లి పశువైద్యాధికారి డాక్టర్ నరేంద్రరెడ్డి, జనసేన నేత సీర్ల లాల్‌చంద్ తదితరులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులు మంత్రి లోకేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో రవి, కోటేశ్వరరావు, అజయ్, శృతి, గౌరి, సరోజిని, సాయినాథ్ వనజ, కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

మండపాలకు అనుమతులు తప్పని సరి

- తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు

తుళ్లూరు, సెప్టెంబరు 6: ప్రశాంత వాతావరణంలో వినాయక చవతి వేడుకలు నిర్వహించుకోవాలని తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు శుక్రవారం రాజధాని గ్రామాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనుమతులు తప్పనిసరిగా ఉండాలని కోరారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోచ్చన్నారు. అలాగే పోలీస్‌స్టేషన్ లోనూ కలిసి అనుమతులు పొందవచ్చని సూచిం చారు. పంచమి రాత్రులు , నవరాత్రులు జరుపుకునే వారు వివరాలు అనుమతి పత్రంలో పేర్కొనాలన్నారు. నిమజ్జనం చేసే రోజు.. రూట్ వివరాలు సమర్పించాలని కోరారు. ప్రశాంతంగా చవితి వేడుకలు నిర్వహించుకుందామని తాడికొండ నియోజకవర్గ టీడీపీ ఆర్టీయస్ కోఆర్డినేటర్ నెలకుదిటి చంద్రశేఖర్ (చందు) టీడీపీ కూటమి శ్రేణులకు పిలుపునిచ్చారు.

మట్టి వినాయక ప్రతిమలు చేసిన పాఠశాల విద్యార్థులు

ఫిరంగిపురం, సెప్టెంబరు 6 : మండలంలోని వేమవరం మండల పరిషత్ పాఠశాలలో వినాయక చవితి సందర్భంగా విద్యార్థులు పర్యావరణ హితంగా మట్టి వినాయక ప్రతిమలను తయారు చేశారని శుక్రవారం ప్రధానోపాధ్యాయులు కమల మోహన్ అన్నారు. విద్యార్థులకు ప్రతిమల తయారీ మార్గదర్శకత్వం వహించి పర్యావరణం, మూలికా పత్రి, వినాయక చవితి ప్రాధాన్యతలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ జెట్టి సుబ్బయ్య, ఉపాధ్యాయులు శేషు, రవి, అంగన్ వాడీ కార్యకర్త పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఓ అధికారి నిర్లక్ష్యంతో రైతులకు తీవ్ర నష్టం

- గత ప్రభుత్వ హయాంలో సమస్యను విన్నవించినా పట్టించుకోని వైనం


నీటమునిగిన పొలాలు

మంగళగిరి,సెప్టెంబరు 6: ఎంటీఎంసీలో ఓ అధికారి నిర్లక్ష్యానికి సుమారుగా 70మంది రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. రైతులు సదరు అధికారికి ముందస్తుగానే విజ్ఞప్తులు చేసుకున్నప్పటికీ ఆ అధికారి పెడచెవిన పెట్టడంతో రైతులు ఆర్థికంగా పెను నష్టాన్ని చవిచూశారు. మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి పట్టణ పరిధిలోని సాయిబాబా గుడి ఎదురు ఉన్న సుమారు 50 ఎకరాల వరి పొలాలు హెచ్‌పీసీ కంపెనీ వెనుక ఉన్న సుమారు 30 ఎకరాల వరి పొలాలలో వర్షపు నీరు చేరి నిల్వ ఉంటుందని పలువురు రైతులు ఎంటిఎంసి పరిధిలోని ఓ కీలక అధికారికి విషయాన్ని విన్నవించి సమస్య వివరించారు. గత ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యేకి కుడి భుజంగా ఉంటున్నాడన్న పేరున్న ఆ అధికారి రైతుల గోడు పట్టించుకోకపోవడంతోనే నేడు ఇటీవల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోవాలల్సి వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వంలో ఉన్న నేతలు ఈ విషయాన్ని గమనించి ఇప్పుడు రైతులను ఇబ్బంది పెట్టిన గత ప్రభుత్వంలో కొమ్ము కాసిన సదరు అధికారిపై చర్యలు తీసుకుని రైతుల సమస్యలు తీర్చాలని తాడేపల్లి రైతాంగం మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేస్తోంది. ఒకటి రెండురోజుల్లో మంత్రి లోకేశ్‌ను కలిసి తమకు జరిగిన నష్టాన్ని వివరిం చేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. కాలువలు సరిగ్గా పూడిక తీయకపోవడం వల్లే పొలాలు మునిగిపోయాయని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

వరద బాధితులకు రూ.లక్ష విరాళం



వరద బాధితుల సహాయార్థం అక్షయపాత్ర సభ్యునికి చెక్కు అందిస్తున్న జేఎంజే కళాశాల విశ్రాంత అధ్యాపక బృందం

తెనాలి, మారీసుపేట, సెప్టెంబరు 6: వరద బాధితులకు ఆహారం అందించేందుకు రూ.లక్ష విరాళాన్ని జేఎంజే కళాశాల విశ్రాంత అధ్యాపక బృందం అందజేశారు. భారీ వర్షాల కారణంగా పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న ప్రజలకు శుక్రవారం ఆహారంను అందించేందుకు జేఎంజే కళాశాల విశ్రాంత అధ్యాపక బృందం కె.శారద ఆధ్వర్యంలో రూ.లక్ష చెక్కును అక్షయపాత్ర సభ్యునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు కె శారద, బేబి సరోజనీ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

రైతులకు జరిగిన నష్టాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్తా

● జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా



ముంపు బాధితులకు ధైర్యం చెబుతున్న జడ్పీచైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిసీనా

తెనాలి రూరల్, సెప్టెంబరు 6: భారీ వర్షాల కారణంగా రైతులకు జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీన అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని కొలకలూరు, హాఫ్‌పేట, కాజీపేట తదితర గ్రామాల్లో నీటము నిగిన పంటపొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. తొలుత కాజీపేటలో ముంపుకు గురైన కాలనీలో పర్యటించారు. ఆమె వెంట పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలలో అపరిశుభ్రత లేకుండా చూడండి

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 6: పట్టణంలో ఉన్న ఖాళీ స్థలాలలో అపరిశుభ్ర వాతావరణం లేకుండా చూడాలని ఖాళీస్థల యజమానులను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక హెచ్చరించారు. స్థానిక పదోవార్డు బొంతా రామయ్య కాలనీలో శుక్రవారం నివేశగృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలను కమిషనర్ బండి శేషన్నతో కలసి పరిశీలించి పలు సూచనలను చేశారు. దోమల నివారణ కోసం ఖాళీ స్థలాలలో నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్‌ను, కల్వర్ట్‌ల కింద ఫాగింగ్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీరవల్లి, కనగాల సేవలు అభినందనీయం

● తహసీల్దార్



నిత్యావసరాలు, వంట సామగ్రిని పంపిణీ చేస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, మురళి, నాగభూషణం

తెనాలి రూరల్, సెప్టెంబరు 6: పేదలకోసం అండగా నిలబడుతున్న గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లిమురళి, ఉపసర్పంచ్ కనగాలనాగభూషణంలు సేవలు అభినందనీయమని తహసీల్దార్ గోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని అంగలకుదురు పంచాయతీ కార్యాలయంలో పునరావాస కేంద్రంలో ఉన్న పేదలకు, పారిశుధ్యకార్మికులకు వంటసామగ్రి, నిత్యవసరాలు ఇతర వస్తువులను గణేష్‌యూత్ కన్వీనర్ టీడీపీనేత వీరవల్లిమురళి, ఉపసర్పంచ్ కనగాలనాగభూషణంల సహకారంతో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దార్ గోపాల కృష్ణ వాటిని మురళి, నాగభూషణంలతో కలిసి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మురళి, నాగభూషణం వంటి నాయకులు ఉంటే పేదలకు భరోసాగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు 4 క్వింటాళ్ల బియ్యం

తెనాలి రూరల్, సెప్టెంబరు 6: కొలకలూరు గ్రామానికి చెందిన పురగిరి క్షత్రియ పెరిక సంఘం ఆధ్వర్యంలో కొల్లిపర మండలం వరద బాధితులకు ఆహారం అందించేందుకు తూములూరు పునరావాస కేంద్రానికి 4 క్వింటాళ్ల బియ్యం అందజేసినట్లు ఆ సంఘ సభ్యులు తెలిపారు. ముతే వెంకటేశ్వరరావు, పిచ్చయ్య, లోకం శ్రీనివాస్ బ్రదర్స్, కొలబందుల బాజీబాబు, సుద్దపల్లి కోటేశ్వరరావు, ముతే శిరీష, చౌడేశ్వరరావులు కలిసి ఆటోలో వాటిని కొలకలూరు నుంచి తరలించారు. మండలంలోని నందివెలుగులో కూచిపూడి ప్రసన్న ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. దుప్పట్లు పంపిణీ చేసినట్లు ట్రస్ట్ నిర్వాహకులు ఓ ప్రకటన ద్వారా తెలిపారు.

నేడు సినీనటి భానుమతి శత జయంతి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 6: ప్రముఖ సినీనటి, గాయని భానుమతి రామకృష్ణ జయంతి శనివారం నిర్వహించనున్నారు. తెనాలి రామకృష్ణ అకాడమీ ఆధ్వర్యంలో శత జయంతి కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. కవిరాజా పార్కులో నిర్వహించే శత జయంతిని జయప్రదం చేయాలని కోరారు. సంగీత విభావరి కూడా జరుగుతుందని చెప్పారు. అయినాల మల్లేశ్వరరావు, సోమయ్య శాస్త్రి, మొవ్వా సత్యనారాయణ, వెంపటి సత్యనారాయణ, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

10లోగా ఈ- పంట నమోదు చేయించుకోండి

● ఏవో ప్రేమసాగర్

తెనాలి రూరల్, సెప్టెంబరు 6: పంటలు సాగు చేపట్టిన రైతులు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల ఏవో ప్రేమసాగర్ ఓ ప్రకటన ద్వారా తెలిపారు. అధికవర్షం కారణంగా పంట నష్టం జరిగిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ (పెట్టుబడి రాయితీ) పొందేందుకు, వరి, మినుము, అరటి వంటివి బీమా సొమ్ము పొందేందుకు ఈ పంట నమోదు తప్పనిసరన్నారు. ఈ నెల 10వ తేదీలోపు రైతుసేవా కేంద్రాలు (ఆర్‌బీకే), వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది లేదా గ్రామ వీఆర్వో వంటి వారిని సంప్రదించి ఈ పంట నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఏవో సూచించారు.

లంక గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం



బొమ్మువానిపాలెంలో వరదకు దెబ్బతిన్న మొక్కజొన్నలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, సబ్‌కలెక్టర్ సంజనాసిన్హా

కొల్లిపర, సెప్టెంబరు 6: కృష్ణానది వరదల కారణంగా అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉందని పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులకు ఆదేశించారు. శుక్రవారం వరద బాధిత ప్రాంతాలైన బొమ్మువానిపాలెం, అన్నవరంలంక, కొత్తూరు లంక గ్రామాల్లో ఆమె సబ్ కలెక్టర్ సంజనాసిన్హాతో కలిసి పర్యటించారు. వరదకు దెబ్బతిన్న పంటలను, పారిశుధ్య పనులను, వైద్యశిబిరాలను పరిశీలించారు. జాగ్రత్తగా ఉండాలని అధికారులకు ఆదేశించారు. స్థానిక ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వరదల కారణంగా వారం రోజులుగా అనేక ఇబ్బందులు పడ్డామని, ఇంట్లో ఉన్న వస్తువులు అన్నీ పాడైపోయాయని, గృహాల్లో నిల్వ చేసిన మొక్కజొన్నలు కూడా దెబ్బతిన్నాయని కలెక్టర్, సబ్‌కలెక్టర్‌కు బాధితులు విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరద బాధితులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోనున్నట్లు తెలిపారు. వరద వలన జరిగిన నష్టాన్ని ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎన్యూమరేషన్ చేయటం జరుగుతుందన్నారు. వరదల వల్ల ఇళ్లకు, పూరి గుడిశలకు, పశువుల పాకలకు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ ద్వారా పంట నష్టాల వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. పంటల ఎన్యూమరేషన్ 10వ తేదీ నాటికి పూర్తిచేసి సోషల్ ఆడిట్‌కు పెట్టడం జరుగుతుందన్నారు. పశువుల దాణాను కూడా అందిస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, డిప్యూటీ సీఈవో మోహన్‌రావు, పరిపాలనాధికారి చంద్రమోహన్, ఈవోపీఆర్‌డీ పూర్ణ శంకరరావు, వ్యవసాయాధికారి వెంకట్రావు తదితరులు ఉన్నారు.

వర్షం పంటలను ముంచెత్తింది.. ఆదుకోండి...

● పెమ్మసాని ఎదుట రైతుల వేడుకోలు



వరద నీరు చేరిన బుర్రిపాలెం ఎస్టీకాలనీని పరిశీలిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్, ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, సెప్టెంబరు 6: ఇటీవల కురిసిన భారీ వర్షం తమ పంటలను నిండా ముంచిందని, సాగుకు పెట్టిన పెట్టుబడి పూర్తిగా నీటి పాలైందని తమను ఆదుకోవాలని కేంద్రసహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఎదుట పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని బుర్రిపాలెం, కొలకలూరు, హాఫ్‌పేట, ఖాజీపేట గ్రామాల్లో నీటమునిగిన వరిపైర్లను మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి పెమ్మసాని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు డాక్టర్ పెమ్మసానితో గత ఐదేళ్లుగా వ్యవసాయంలో లాభం చూసిందేలేదన్నారు. పంటలు చేతికి అందే సమయానికి ప్రకృతి విపత్తులు సంభవించి పంటలు నీటమునిగి తమకు అపారనష్టాన్ని మిగులుస్తున్నాయన్నారు. గత ప్రభుత్వంలో కనీసం నష్టం అంచనా వేసేందుకు కూడా అడ్డగోలు నిబంధనలు పెట్టి రైతును నిండాముంచారని వాపోయారు. ప్రభుత్వం రైతాంగానికి నష్టపరిహారం ప్రకటించి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. ఇప్పటికే వ్యవసాయశాఖ రైతులకు జరిగిన నష్టాన్ని ప్రాథమిక అంచనా వేస్తుందన్నారు. పంటలను కోల్పోయిన ప్రతి ఒక్కరైతుకు న్యాయం జరిగేలా చూస్తానని పెమ్మసాని హామీ ఇచ్చారు. తొలుత బుర్రిపాలెం గ్రామంలోని ఎస్టీకాలనీని క్షేత్రస్థాయిలో పరిశీలించి పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న కాలనీ వాసుల యోగక్షేమాలను విచారించారు. ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఆయా గ్రామాల రైతులు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌కు దాతల సహకారం అభినందనీయం: పెమ్మసాని

తెనాలి రూరల్, సెప్టెంబరు 6: సీఎంఆర్ఎఫ్ ఫండ్‌కు దాతలు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా విరాళాలు అందించడం అభినందనీయమని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. వరద బాధితులను పరామర్శించేందుకు శుక్రవారం బుర్రిపాలెం వచ్చిన కేంద్రసహాయ మంత్రి డాక్టర్‌పెమ్మసానిని పలువురు కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. గుంటూరుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు తాళ్ల వెంకటేష్ యాదవ్ తన జన్మదినంను పురస్కరించుకుని సీఎంఆర్ఎఫ్ ఫండ్‌కు రూ.5లక్షల చెక్కును పెమ్మసాని చంద్రశేఖర్‌కు అందజేశారు. అదేవిధంగా దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి రూ.20వేల నగదును, అత్తోటకు చెందిన టీడీపీ నాయకులు కఠారి ఆంజనేయులు, దాసరి నరసయ్య ముంగర బుల్లికోటయ్య కలిసి రూ.20వేలు సీఎంఆర్ఎఫ్ ఫండ్‌కి పెమ్మసానికి అందజేశారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.



కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు చెక్కును అందిస్తున్న తాళ్ల వెంకటేష్‌యాదవ్

మట్టి వినాయకుడిని పూజిద్దాం

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న, తదితరులు

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 6: పట్టణ ప్రజలు వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి వినాయకుల్ని పూజిద్దాం - పర్యావరణాన్ని రక్షించుకుందామని పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పిలుపునిచ్చారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం వినాయక చవితి పండుగను పురస్కరించుకొని మట్టి వినాయక ప్రతిమలను డబుల్ హార్స్ మినుపగుళ్ళ వారి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ముఖ్య అతిథిగా పాల్గొని వినాయక ప్రతిమలను పురపాలక సంఘ అధికారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయక చవితి పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని కోరారు. కమిషనర్ శేషన్న మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించాలని, ప్లాస్టిక్ కవర్లను వాడరాదని, పారిశుధ్యాన్ని పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ కె.హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక మట్టి ప్రతిమల పంపిణీ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 6: పట్టణ ప్రజలు ఇళ్లల్లో పూజలు చేసుకునేందుకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తపేట కార్యాలయంలో భక్తులకు క్లబ్ అధ్యక్షుడు కోట పార్థసారధి ప్రతిమలు అందజేశారు. మారీసుపేట, గంగానమ్మపేట, రామలింగేశ్వరపేట శివాలయాలలో కూడా భక్తులకు విగ్రహాలను అందజేశారు. సాయికిరణ్, శ్రీనివాసరావు, లక్ష్మణ్, మురళీధర్, శరత్‌బాబు, ధనుంజయ పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో...

కొల్లిపర, సెప్టెంబరు 6: కొల్లిపరలో బ్రాహ్మణ భవన్‌లో బ్రాహ్మణ సంఘ ఐక్యవేదిక అందజేసిన మట్టి వినాయక విగ్రహాలను శుక్రవారం టీడీపీ, వైసీపీ, జనసేన నాయకులు ఉచితంగా పంపిణీ చేశారు. బ్రాహ్మణ సంఘ ఐక్యవేదిక అధ్యక్షుడు పోగుల రామలింగేశ్వరశర్మ మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ రాధిక, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, వివిధ పార్టీల నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, భీమవరపు సుబ్బారెడ్డి, భీమవరపు లంకకోటిరెడ్డి, భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి, బ్రాహ్మణ సంఘ నాయకులు జగన్నాథాచార్యులు, కొల్లిపర కుటుంబరావు, పిచ్చియ్యశర్మ, రమణశర్మ, సూర్యనారాయణ శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.



మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న బ్రాహ్మణ పరిషత్ సభ్యులు

కోలాహలంగా చవితి ఏర్పాట్లు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 6: వినాయక చవితి వేడుకలకు సర్వం సిద్ధం అవుతున్నాయి. వినాయక చవితి ఉత్సవాల కోసం పొన్నూరులో గణపతి మండపాలు సిద్ధం అయ్యాయి. ఇప్పటికే పొన్నూరు పట్టణంలో మట్టి గణపతులను పలు స్వచ్ఛంద సంస్థలు పంపిణీ చేశాయి. అలాగే గణనాథుడి కోసం ప్రత్యేక మందిరాలను, మండపాలను నిర్మిస్తున్నారు. గణనాథుల పూజా వస్తువుల విక్రయ స్టాళ్లతో పట్టణ కేంద్రం కోలాహలంగా మారింది.

కిటకిటలాడిన వీధులు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 6: ఆంధ్రా ప్యారిస్ తెనాలి పట్టణంలో వినాయకచవితి వేడుకలు వైభవంగా నిర్వహించుకునేందుకు భక్తులు విస్తృతఏర్పాట్లు గావించారు. పట్టణంలో ఎక్కడచూసినా గణనాథునికి పూజలు చేసేందుకు వేదికలు నిర్మించి విగ్రహాలను ఏర్పాటుచేశారు. పట్టణంలో మెయిన్ రోడ్డు, మార్కెట్ సెంటర్, బోసురోడ్డు, గాంధీచౌక్, ప్రకాశం రోడ్డు, గంగానమ్మపేట, చెంచుపేట తదితర ప్రాంతాల్లో వినాయక చవితి పూజలకు అవసరమైన పత్రి, అరటి చెట్లు, వినాయక విగ్రహాలు, పూలు, పండ్లు విక్రయించేందుకు భారీగా ఏర్పాట్లుచేశారు. దీంతో అక్కడ వీధులు కిటకిటలాడాయి.

గొర్రెలను ఢీ కొట్టిన లారీ

● సుమారు 12 గొర్రెలు మృతి ● 8 గొర్రెలకు గాయాలు

తెనాలి రూరల్, సెప్టెంబరు 6: రోడ్డుపక్కన వెళుతున్న గొర్రెలను లారీ ఢీకొట్టిన ఘటన మండలంలోని కొలకలూరులో చోటు చేసుకుంది. బాధితుడు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలానికి చెందిన డొక్కు వెంకటేశ్వరరావు గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొల్లూరు మండలం నుంచి తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు మందలను తోలుకుని వస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత నందివెలుగు - కొలకలూరు ప్రధాన రహదారిపై కొలకలూరు బ్రిడ్జ్ సమీపంలో వేగంగా వస్తున్న లారీ 20 గొర్రెలమీదకు దూసుకువచ్చింది. దీంతో 12 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా 8 గొర్రెలకు గాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

పంట పొలాలను పరిశీలించిన సీపీఐ నాయకులు

పెదకాకాని, సెప్టెంబర్ 6: పెదకాకాని మండలం నంబూరు గ్రామంలో అధిక వర్షాలకు ముంపునకు గురైన పంట భూములను కేరళ రాష్ట్రం సీపీఐ పార్లమెంటరీ నాయకులు సందర్శించారు. సీపీఐ పార్లమెంటరీ నాయకులు సంతోష్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి జమలయ్య, సీపీఐ కేంద్ర కమిటీ సభ్యురాలు అక్కినేని వరద ముంపునకు గురైన పొలాలను సందర్శించి మాట్లాడుతూ నంబూరులో గుంటూరు ఛానల్ కాలువలకు గండిపడి వేల ఎకరాలు పంట పాడైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సీపీఐ ఆధ్వర్యంలో కొత్త కాలువ గట్లు బలహీనంగా ఉన్నాయని త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ కార్యాలయంలో ఇచ్చినప్పటికీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈరోజు వేలాది ఎకరాలు ముంపునకు గురయ్యాయన్నారు. గుంటూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, ఎన్టీఆర్ జిల్లా సీపీఐ కార్యదర్శి దోనేపూడి శంకర, విజయవాడ టౌన్ సీపీఐ సెక్రటరీ కోటేశ్వరరావు కోట మాలాద్రి, చిన్ని తిరుపతయ్య, కౌలు రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు పీవీ జగన్నాథం తదితరులు. పాల్గొన్నారు

ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నిత్యావసరాల పంపిణీ

కొల్లిపర, సెప్టెంబరు 6: మండల పరిధిలోని బొమ్మువానిపాలెంలో 200మంది వరద బాధితులకు శుక్రవారం ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు కనపర్తి రత్నాకర్, తెనాలి అధ్యక్షుడు పుట్ట పున్నయ్య, కార్యదర్శి ఎస్.ఎస్.జహీర్, ఎం.శ్రీకాంత్, శేఖర్, గుమ్మడి ప్రకాశరావు, కరేటి సాంబశివరావు, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 6: డాక్టర్ అంబేద్కర్ భావజాలం వ్యాప్తికి జై భీం సమూహం కృషి చేస్తుందని ఆ సంస్థ నిర్వాహకులు ఎద్దు శ్యామ్యూల్ రాజ్ అన్నాడు. జై భీమ్ సమూహం ఏర్పాటుచేసి అంబేద్కర్‌కు నిత్య నివాళి కార్యక్రమం ప్రారంభించి మూడేళ్లు అయిన సందర్భంగా శుక్రవారం ఐలాండ్ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు నివాళి అర్పించారు. అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని కులమత రహితంగా ప్రజలందరికీ చేరవేయాలని లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తునట్లు చెప్పారు. కార్యక్రమంలో జైభీం సమూహం సభ్యులు కంచర్ల కిరణ్, గుమ్మడి రోశయ్య, బి సుబ్బారావు, పిఎల్ శ్రీనివాసరావు, జోగి నాగేశ్వరరావు, చల్లాపల్లి ఆనంద్, జంగా రాజేష్, యడ్ల వందనం, వేముల నిరీక్షణ రాజు పాల్గొన్నారు.

మట్టి గణేషులను పూజిద్దామని ర్యాలీ

తెనాలి, మారీసుపేట, సెప్టెంబరు 6: పట్టణ ప్రజలు, విద్యార్థులు వినాయక చవితి పండుగను పురస్కరించుకొని సంప్రదాయబద్ధంగా మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దామని నల్లమోతు చెంచురామానాయుడు మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం పీవీ సుధారాణి అన్నారు. శుక్రవారం హైస్కూల్‌లో మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దామని పర్యావరణాన్ని కాపాడదామని విద్యార్థులతో సుధారాణి అన్నారు. మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే పూజించాలని విద్యార్థులను కోరారు. అనంతరం పట్టణంలో మట్టి వినాయకుడ్ని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడదాం అంటు నినాదాలు చేస్తూ స్కూల్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ కె.స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి గణనాథులను పూజించాలి: ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 6: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి గణనాథులనే పూజించాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. నియోజకవర్గ ప్రజలకు, జిల్లాలోని పాడి రైతులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. విఘ్నాలు తొలిగి ప్రజలందరూ సుఖసంతోషాలతో విలసిల్లాలని నరేంద్ర కుమార్ ఆకాంక్షించారు. టీడీపీ నాయకులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

14న జాతీయ లోక్ అదాలత్

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 6: స్థానిక సివిల్ కోర్టులో ఈ నెల 14వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయసేవాధికారి సంస్థ చైర్‌పర్సన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అంజని ప్రియదర్శిని శుక్రవారం తెలిపారు. అదాలత్‌లో రాజీ పడదగిన కేసులు పరిష్కరించనునట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు.

పేదలకు అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వం

● నిత్యావసరాల పంపిణీలో డాక్టర్ శ్రీరత్న



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ పెమ్మసాని శ్రీరత్న, తహసీల్దార్ గోపాలకృష్ణ తదితరులు

తెనాలి రూరల్, సెప్టెంబరు 6: కూటమి ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని వదర ముంపు బాధితులెవ్వరూ ఆందోళన చెందవల్సిన అవసరం లేదని కేంద్రసహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి డాక్టర్ శ్రీరత్న చెప్పారు. శుక్రవారం మండలంలోని బుర్రిపాలెం పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న వరద ముంపు బాధితులకు నిత్యావసరాలను గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి, తహసీల్దార్ గోపాలకృష్ణతో కలిసి పంపిణీ చేశారు. అదేవిధంగా మండలంలోని కోపల్లె, అంగలకుదురు, కొలకలూరు గ్రామాల్లోని పునరావాస కేంద్రాలకు తహసీల్దార్ గోపాలకృష్ణ నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కూటమి నాయకులు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బీసీ సంఘం వితరణ



సరుకులతో నాగలింగం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 6: విజయవాడ వరద బాధితులకు జంగమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి నాగలింగం నిత్యావసర సరుకులు అందజేశారు. తెనాలిలో వివిధ రకాల సరుకులతో నింపిన రూ.4వేల విలువైన కిట్‌ను రూపొందించి వందమందికి పంపిణీ చేశామని తెలిపారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసరాల పంపిణీ

పెదకాకాని, సెప్టెంబరు 6: పెదకాకానిలోని దర్గా ఏరియాలో అకాల వర్షం కారణంగా నష్టపోయిన 135కుటుంబాలకు నిత్యావసరాలను టీడీపీ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. బియ్యం 25 కేజీ, పంచదార 1 కేజీ కందిపప్పు 1 కేజీ, పామాయిల్ 1కేజీ, ఉల్లిపాయలు 2కేజీ, బంగాళాదుంపలు 2కేజీల చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డీవీసీ కాలనీలో సాధారణ స్థితి



పట్టణంలో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 6: అధిక వర్షాలకు నీట మునిగిన డీవీసీ కాలనీలో వరదను మళ్లించి సాధారణ స్థితిని తీసుకువచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం పొన్నూరు పట్టణంలోని భావనగర్ కాలనీ, డీవీసీ, డీఆర్కే కాలనీలు, 14 వార్డు, 17, 19 వార్డులను కమిషనర్ పరిశీలించారు. జనావాసాల మధ్య వర్షపునీటిని మళ్లించే ఏర్పాట్లుచేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య సమస్యలు పరిష్కరించేలా సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఈఈ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



నీటిలో నానుతున్న వరి పైర్లను పరిశీలిస్తున్న అధికారులు

రైతులు పంటల సాగు వివరాలను నమోదు చేసుకోవాలి

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 6: రైతులు పంటల సాగు వివరాలను తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్నా వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని వెల్లలూరు, మునిపల్లె, బ్రహ్మణకోడూరు, జూపూడి, దొప్పలపూడి, మన్నవ గ్రామాలో అధిక వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను జిల్లా వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పంటపొలాలో ఉన్న నీటిని బయటకు పంపించాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది పంట నష్ట పరిహారాల అంచనాలు తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఏడీఏ పి.రామకోటేశ్వరి, ఏవో దేగల వెంకటరావమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు బండ్లమూడి బాబురావు పాల్గొన్నారు.